క్లుప్తంగా

రక్తదానం చేసి ఆదర్శంగా నిలవాలి



రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న శ్రీరామమూర్తి

నందిగాం: రక్తాన్ని దానం చేసి యువత ఆదర్శంగా నిలవాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలాస ప్రభుత్వ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారికి, వివిధ ఆరోగ్య సమస్యలతో ఉన్న వారికి అత్యవసరంగా రక్తం అవసరం ఉంటుందన్నారు. అలాంటి రక్తాన్ని యువత దానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. అనంతరం రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారిణి కె.అనితకుమారి, పలాస ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు చిన్నంనాయుడు, రఘురామమూర్తి పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం



సత్కారం పొందిన కళాకారులు

కాశీబుగ్గ: ఉగాదిని పురస్కరించుకుని శ్రీకాకుళం ఈవేమన కవిత నిలయం వారిచే పలాస కళాకారులకు సన్మాన కార్యక్రమం జరిగింది. పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన కళాకారులు, రచయితలు, పర్యావరణ ప్రేమికులు కొత్తపల్లి చిన్నాచారి, బూర్జీ కోటేశ్వరరావు, గుమ్మడి సాంబమూర్తి మాస్టారులకు ఆదివారం సన్మానించి గౌరవించారు. లలిత కళారంజని, జనజాగృతి, గ్రీన్‌ఆర్మీ వంటి పర్యావరణ పరిరక్షణ కార్యకలాపలతో పాటు వారు చేస్తున్న సాహిత్యం సేవలకు గుర్తించి నిర్వాహకులు దుశ్శాలులతో సత్కరించి మెమెంటో, ప్రశంసాపత్రాలను అందజేశారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: తులసిగాం గ్రామానికి చెందిన నిరంజన్ భడిత్యా రోడ్డు ప్రమాదంలో కుడి కాలుకు తీవ్రగాయాలయ్యాయి. ఆర్థిక ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన యువసేన ఫౌండేషన్ సభ్యులు రూ. ఐదు వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడికి ఆదివారం అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



దాలయ్యకు సాయం అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మున్సిపాలిటీలోని 19వవార్డు సూది కొండకు చెందిన ఉంకిలి దాలయ్య అనారోగ్యానికి గురయ్యారు. దీంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఇంటికి చేరుకున్న ఆయన్ని వైఎస్సార్‌సీపీ 19వ వార్డు ఇన్‌చార్జి శిష్టు గోపి, పలువురు నాయకులు ఆదివారం పరామర్శించారు. ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. నాయకులు బగాది సింహాచలం, సీపాన లోకేష్, పిట్టా భాస్కరరావు, ఈశ్వరరావు, పురుషోత్తం, మార్పు కృష్ణ, కొనారి ఆది, మార్పు చిన్న, నెయ్యిల రాజు, బోనెల శ్రీకాంత్ ఉన్నారు.

బాధ్యతలను గుర్తెరగాలి



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

వజ్రపుకొత్తూరు: గోవిందపురంలోని వివేకానంద విద్యా సంస్థల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల డైరెక్టర్ పేరాడ సోమేశ్వరరావు మాట్లాడుతూ.. తమ పిల్లల విషయంలో తల్లిదండ్రులు బాధ్యతలను గుర్తెరగాలన్నారు. అప్పుడే వారికి క్రమ శిక్షణతో కూడిన విద్య అలవడుతోందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను అలరించాయి. ప్రిన్సిపాల్ డి.వనజనాభవం, మెట్ట మోహనరావు, ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

● తక్షణ సాయం



సువర్ణాపురం పంచాయతీ పరిధి గుడ్డిభద్ర గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గేదెల కృష్ణారావు భవనంపై నుంచి జారిపడి ఇటీవల మృతి చెందాడు. మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సాయంగా రూ. పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని అతని భార్య సరస్వతికి సచివాలయ సిబ్బంది ఆదివారం అందజేశారు. నారాయణపురం ఎంపీటీసీ సభ్యురాలు గొరకల పార్వతి, కేశవరావు, వైఎస్సార్ నాయకులు జుత్తు శంకరరావు, దున్న శకుంతల, దున్న కోదండరావు, కృష్ణారావు, హేమరాజు పాల్గొన్నారు.

–మందస

● అవగాహన



చిరు, తృణ ధాన్యాల వినియోగంతో చేకూరే లాభాలపై అవగాహన కల్పిస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలు టెక్కలి పట్టణంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ చిరు ధాన్యాల మహోత్సవం సందర్భంగా కంద్రవీధి, గోపినాథపురంలో వైఎస్సార్ కాంతి పథం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో చిరు ధాన్యాలకు అత్యంత డిమాండ్ ఉందని..వీటి సాగును ప్రోత్సహించాలని నినాదాలు చేశారు. ఏపీఎం జి.నారాయణరావు, సీసీలు పద్మ, వరదరాజు, సరోజిని, నీలవేణి, వీఓఏ మహేశ్వరి పాల్గొన్నారు.

–టెక్కలి

● భక్తి శ్రద్ధలతో..



తిప్పనపుట్టుగ గ్రామంలో కాళీమాత సంబరాన్ని భక్తి శ్రద్ధలతో గ్రామస్తులు ఆదివారం నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను మేళతాళాల మధ్య ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తజనం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

–ఇచ్ఛాపురం రూరల్

తీరనున్న కష్టాలు!



కల్వర్టు నిర్మాణం చేపడుతున్న దృశ్యం



కల్వర్టు లేకపోవడంతో నీటితో నిండిపోయిన రోడ్డు (ఫైల్)

టెక్కలి రూరల్: గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పిదంతో టెక్కలి ప్రజలు కొన్నేళ్లుగా ఇబ్బందులకు గురయ్యారు. వర్షం కురిస్తే నీరు రహదారిపైకి చేరి నిలిచిపోవడంతో వాహనదారులతో పాటుగా పాదచారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యేవారు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కల్వర్టు నిర్మాణం చేపట్టడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది. ప్రజల కష్టాలు తీరాయి. వివరాల్లోకి వెళితే.. గత టీడీపీ ప్రభుత్వంలో నౌపడ రోడ్డులోని సంతోషిమాత గుడి సమీపంలో ఉన్న కల్వర్టను మరమ్మతుల పేరుతో కూల్చివేశారు. దీని స్థానంలో సిమెంట్ పైపులు వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో టెక్కలి చుట్టుపక్కల నుంచి వచ్చే వర్షపు నీరు వెళ్లేందుకు ఆ పైపుల స్థాయి సరిపడలేదు. దీంతో రోడ్డుపైకి వర్షం నీరు చేరేది. రహదారి మొత్తం వరదదో నిండిపోయి ప్రజలు, వాహనాదారులు, సమీప దుకాణాల యజమానులు అనేక ఇబ్బందులు పడేవారు. ప్రజల కష్టాలను చూసిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి దీనిపై దృష్టిసారించారు. అధికారులతో మాట్లాడి నిధులు కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పైపులైన్‌ను తొలగించి..దానిస్థానంలో పెద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టారు. అలాగే కల్వర్టు పైనుంచి పక్కా రహదారి నిర్మాణం చేపడుతున్నారు. దీంతో సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

రాష్ట్రస్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ‘షూగైడ్’ ఎంపిక



షూగైడ్ ప్రాజెక్టు పనితీరును కలెక్టరుకు వివరిస్తున్న సాల్మన్‌రాజు

పలాస: బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి సాల్మన్‌రాజు రూపొందించిన ‘షూగైడ్’ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఎంపికైంది. అంతర్జాలం ద్వారా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 240 ప్రాజెక్టులు పోటీ పడగా 24 రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. అందులో ‘షూగైడ్ ’ఒకటి. దృష్టి లోపం ఉన్నవారికి ఎటువంటి అవరోధం లేకుండా సరైన మార్గనిర్దేశానికి, మహిళలు, పిల్లలు ఆపదలో ఉన్నప్పుడు ట్రాక్ చేయడానికి, అలాగే సైనికులు, పోలీసులు బాంబులను గుర్తించడానికి ఈ షూగైడ్ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలో ఈ ప్రాజెక్టును తిలకించిన జిల్లా కలెక్టరు శ్రీకేష్ బి.లాఠకర్, జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ విద్యార్థి సాల్మన్‌రాజును ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వైకుంఠరావు, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు సాల్మన్‌రాజుకు, మార్గదర్శి ఉపాధ్యాయుడు కొయ్యల శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేశారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన



మాట్లాడుతున్న సీఐ శంకరరావు

వజ్రపుకొత్తూరు: పేదరికాన్ని నిర్మూలించగల ఏకైక ఆయుధం విద్య అని కాశీబుగ్గ రూరల్ సీఐ జి.శంకరరావు అన్నారు. పూండిలోని సాయి వినీత్ విద్యా సంస్థల్లో ఆదివారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పేద, ధనిక తేడా లేకుండా ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయం వైపు సాగాలని సూచించారు. తల్లిదండ్రులను ఉన్న స్థితినుంచి ఉన్నతస్థితికి చేర్చేందుకు క్రమశిక్షణ, నైపుణ్యం, నిజాయితీతో ముందుకు పోవడం ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల జానపద, సినీ గీతాలకు చేసి నృత్యాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీల, డైరెక్టర్ సీహెచ్ కోదండరావు, ప్రిన్సిపాల్ అన్నెపు కైలాసరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ కె.లక్ష్మీనారాయణ, ఇ.పాపారావు పాల్గొన్నారు.

శ్రీజగన్నాథపురం రోడ్డుకు మోక్షం



తారు రోడ్డుగా రూపుదిద్దుకున్న శ్రీజగన్నాథపురం రహదారి

కోటబొమ్మాళి: జాతీయ రహదారి నుంచి శ్రీజగన్నాథపురం వెళ్లే రోడ్డుకు మోక్షం కలిగింది. శ్రీజగన్నాథపురం, సరియాబొడ్డపాడు, బిర్లంగి, బడ్డిపేట, గోదావరిపేట గ్రామాలకు వెళ్లే రెండు కిలోమీటర్ల రోడ్డును నాబార్డు నిధులు రూ. రెండు కోట్లతో తారు రోడ్డుగా నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో అధ్వానంగా రోడ్డు ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత శ్రీజగన్నాథపురం సర్పంచ్ నూక శైలజ, ఎంపీటీసీ సభ్యురాలు సింగూరు కల్యాణి, నాయుకులు నూక సత్యరాజ్, సింగూరు వాసు సమస్యను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. దీంతో తొలుత గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఇటీవల తారు రోడ్డు పనులు పూర్తి చేశారు. దీంతో ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో ఇటుకల తయారీదారుల ఆందోళన



వర్షం నీటిలో ఊక, ఇటుకలు

వజ్రపుకొత్తూరు: అకాల వర్షంతో ఇటుకల తయారీ పరిశ్రమదారులు ఆందోళన చెందుతున్నారు. శని, ఆదివారాల్లో మండలంలో మోస్తరు వర్షం కురిసింది. బెండిగేటు ప్రాంతంలో సుమారు పది పరిశ్రమల్లో ఉన్న ఇటుకలపై టార్పాలిన్ కప్పిఉంచినప్పటికీ పచ్చివి కావడంతో తడిసిపోయాయి. అలాగే ఇటుకలను బట్టీల్లో వేసి కాల్చేందుకు వాడే ఊక, ఇతర సామగ్రి నీటిలోనే ఉండిపోయాయి. సుమారు 20 వేల ఇటుకలు పాడైనట్లు పరిశ్రమదారులు చెబుతున్నారు.

నేడు వాహనాల వేలం

వజ్రపుకొత్తూరు రూరల్: పలు మద్యం కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఆదివారం ఉదయం 11 గంటలకు పలాస స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ కృష్ణారావు, తహసీల్దార్ బి.అప్పలస్వామి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవారు తమ ఆధార్ కార్డుతో హాజరై.. వెయ్యి రూపాయలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

మైక్‌సెట్ వితరణ



కమిటీ సభ్యులకు మైక్‌సెట్ అందజేస్తున్న దృశ్యం

నందిగాం: శివరాంపురం పంచాయతీ కొటియా కొండపేటలో నూతనంగా నిర్మించిన పాలపోలమ్మ తల్లి ఆలయానికి నందిగాం మండల ప్రత్యేక ఆహ్వానితుడు, యాదవ సంఘం అధ్యక్షుడు చిన్ని జోగారావు దంపతులు ఆదివారం మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఆలయ ప్రతిష్ఠ శనివారం జరిగింది. చివరి రోజైన ఆదివారం మహిళలచే సామూహిక కుంకుమాభిషేకాలు, అన్నప్రసాద వితరణ గావించారు.

పవర్ బోరు ప్రారంభం



కుళాయి ప్రారంభిస్తున్న చైర్మన్ గిరిబాబు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ రెండో వార్డు పరిధి కోసంగిపురం గ్రామంలో రూ. మూడు లక్షలతో ఏర్పాటు చేసిన పవర్‌బోరు, ట్యాంకర్‌ను మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు ఆదివారం ప్రారంభించారు. మంచినీటి వనరులు సమకూరడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి బడగల బళ్లయ్య నాయుడు, 19వవార్డు కౌన్సిలర్ శిష్టు గోపి, స్థానిక నాయకులు బిరాటి వల్లభ, వైకుంఠరావు, కింతల శివయ్య, రామన్నాయుడు పాల్గొన్నారు.

మురుగునీరు మళ్లింపు



మురుగునీటిని మళ్లిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై నిలిచిపోయిన మురుగునీటిని ఆదివారం తొలగించారు. మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, కమిషనర్ రాజగోపాలరావు ఆదేశాలతో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ జేసీబీతో పలాస నుంచి కాశీబుగ్గ వరకు కేటీరోడ్డులో నిలిచిపోయిన మురుగు తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ రమణ, శానిటేషన్ కార్యదర్శి ఉదయ్‌కుమార్, సూపర్‌వైజర్ మోహన్ పాల్గొన్నారు.

రామనామస్మరణతో ముక్తి

శ్రీకాకుళం కల్చరల్: రామనామ స్మరణ ముక్తికి సోపానమని వక్త నిష్టల నరసింహమూర్తి అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఆదివారం రామనామ మహత్యంపై ప్రసంగించారు. రామనామ స్మరణ చేసి గోపన్న, త్యాగయ్య, పోతయ్యలు మోక్షం పొందారని ఉదహరించారు. ముందుగా వక్తను మందిర సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరావు, పతంజలి శాస్త్రి, కోమలరావు, ప్రసాద్, వెంకటరావు, తవుడు, బాబూరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రామారావుకు ఘన స్వాగతం



సోంపేట: ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్సీ రామారావు



కంచిలి: పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు, సాయిరాజ్ తదితరులు



కవిటి: ఎమ్మెల్సీ రామారావు దంపతులను సత్కరిస్తున్న కొత్తపుట్టుగ గ్రామస్తులు

సోంపేట: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా విజయం సాధించి తొలిసారిగా నియోజకవర్గానికి చేరుకున్న నర్తు రామారావుకు ఘన స్వాగతం లభించింది. శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలుసుకుని ఆదివారం నియోజకవర్గానికి వచ్చిన ఆయనకు నాలుగు మండలాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు భారీగా కొర్లాం జంక్షన్ వద్దకు చేరుకుని ఘన స్వాగతం పలికారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త సాయిరాజ్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తదితరులు రామారావుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం కార్యకర్తలు ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. బారువ జంక్షన్ వద్ద స్థానిక సర్పంచ్ యర్ర రజనీ, పార్టీ నాయకుడు తారకేశ్వరరావు, వైస్ ఎంపీపీ గురాల శ్రీను, పార్టీ కార్యకర్తలు, పలాపురం జంక్షన్ వద్ద జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, సర్పంచ్ తడక జోగరావు, ఎంపీటీసీ సభ్యుడు పి.వెంకటరమణ, జింకిభద్ర జంక్షన్‌లో సర్పంచ్ తామాడ పద్మావతి, సోంపేట పట్టణంలో సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎంపీటీసీ సభ్యులు పాడుగు కామేష్, ధర్మారావు ఎమ్మెల్సీకి అభినందనలు తెలియజేశారు. సోంపేటలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బుద్దాన శ్రీకృష్ణ, రౌతు విశ్వనాథం, పాతిన శేషగిరి, ఎస్.హరీష్ కుమార్, ఉగ్రపల్లి తిరుపతిరావు, దుమ్ము ఢిల్లీరావు, ఎస్.రాజు, జి.ధర్మారావు, కె.శ్రీనువాసరావు పాల్గొన్నారు.

రాధాకృష్ణ ఆలయంలో పూజలు

కంచిలి: ఎమ్మెల్సీ నర్తు రామారావు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌తో కలిసి కంచిలిలోని రాధాకృష్ణ ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో రామారావు సతీమణి చామంతి, కంచిలి, కవిటి ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, కడియాల పద్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రామదాసు, వజ్జ మృత్యుంజయరావు, నర్తు నరేంద్రయాదవ్, సాలిన లక్ష్మణమూర్తి, దట్టి అజయ్ ఉన్నారు.

సొంతూరు రుణం తీర్చుకుంటా

కవిటి: రాజకీయంగా తన ఉన్నతికి కారణమైన సొంతూరు రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఎమ్మెల్సీగా గెలుపొంది తొలిసారిగా స్వగ్రామం కొత్తపుట్టుగ వచ్చిన ఆయనకు స్థానిక ఘన స్వాగతం పలికారు. అనంతరం నర్తు రామారావు, చామంతి దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

‘కూన’కు బుద్ధి చెబుతాం



మాట్లాడుతున్న సంఘ నాయకులు

మందస: యాదవులను కించపరిచే వ్యాఖ్యలు చేసిన తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్‌కు తగిన బుద్ధి చెబుతామని యాదవ సంఘం అధ్యక్షుడు మద్దిల రామారావు, గౌరవ అధ్యక్షుడు మట్ట ఆనందరావు, భేతాళపురం సర్పంచ్ మామిడి సింహాద్రి హెచ్చరించారు. మందసలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అగ్రవర్ణ, పెత్తందారీ భావజాలంతో కూన చేస్తున్న వ్యాఖ్యలపై రానున్న సాధారణ ఎన్నికల్లో యాదవుల తడాఖా చూపిస్తామన్నారు. జిల్లాలో టీడీపీ యాదవలను గౌరవించకపోయినా, కనీసం మండలస్థాయిలో పదవులు ఇవ్వక పోయినా.. పార్టీకి ఊడిగం చేస్తున్నందుకు మీకు అంతకన్నా ఎక్కువ అభిప్రాయం ఎలా కలుగుతుందని ప్రశ్నించారు. యాదవ సామాజిక వర్గంపై మీకు చులకన భావం ఉంటే, మీ పార్టీ ఎందుకు తమ సామాజిక వర్గాన్ని గౌరవిస్తుందన్నారు. ఎటువంటి పదవులు, ప్రయోజనాలు ఆశించకుండా మీకు మొక్కుతూ, మీ ఆధిపత్యానికి పెరగడానికి మీకు ఓట్లేస్తూ నాయకులను చేస్తున్నందుకు తగిన ప్రతిఫలం దక్కిందన్నారు. సమావేశంలో నాయకులు సార దూర్వాసులు, డొక్కరి దండాసి, తలగాన పాపారావు, నూకల రమణ, కొల్లి లింగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్నారావు

కాశీబుగ్గ: గొర్రెలు కాసే వాళ్లు హీనులంటూ యాదవులను కించపరిచే వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకుడు కూన రవికుమార్‌కు వచ్చే ఎన్నికలో తగిన బుద్ధి చెబుతామని అఖిల భారతీయ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రాపాక చిన్నారావు అన్నారు. ఆదివారం పలాసలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అగ్రవర్ణ, పెత్తందారు భావజాలం యాదవులపై చేసిన అనుచిత వ్యాఖ్యలతో అర్థమౌతుందన్నారు. రెండు రోజుల్లో యాదవ కుల పెద్దలతో కలిసి కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో కూన రవి కుమార్‌పై ఫిర్యాదు చేస్తామన్నారు.

నేటినుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్

మందస: ఆధార్ కార్డు తీసుకొని పదేళ్లు పూర్తయిన వారంతా నంబర్‌ను అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డాక్యుమెంటేషన్ అప్డేషన్ స్పెషల్ ఆధార్ డ్రైవ్‌ను ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 20, 21, 27, 28, 29 తేదీల్లో మందస–1, 3, సాబకోట, తాళ్లగురంటి, బుడారిసింగి, బెల్లుపటియా, భోగాపురం, పిడిమందస, కొండలోగాం, కొంకడాపుట్టి, భైరిసారంగపురం, సొండిపూడి, బహడపల్లి, నారాయణపురం, హరిపురం, లోహరిబంద, దున్నవూరు, అంబుగాం, సువర్ణాపురం సచివాలయాల పరిధిలో ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక కేంద్రాలకు 19 మంది డిజిటల్ అసిస్టెంట్లను నియమించామన్నారు.

కంచిలి: 2016 జూన్ 30వ తేదీ ముందు ఆధార్ కార్డు తీసుకొన్నవారంతా తమ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారని ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కంచిలి–2, మఠంసరియాపల్లి, డి.జి.పురం, మండపల్లి గ్రామ సచివాలయాల్లో ఈ నెల 20, 21 తేదీల్లో ఆధార్ అప్‌డేటింగ్ స్పెషల్ డ్రైవ్‌ను చేపడుతున్నామని, ఈ కేంద్రాలకు వెళ్లి అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు.

ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలి

పలాస: పదేళ్ల క్రితం ఆధార్‌కార్డును తీసుకున్నవారంతా తాజాగా అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు సూచించారు. చినంచల సచివాలయం కేంద్రంలో ఈ నెల 20న కేదారిపురం, 21న పెదంచల, 27న బొడ్డపాడు, 28న గురుదాసుపురం, 29న మాకన్నపల్లి గ్రామస్తులు ఆయా కేంద్రాలకు వెళ్లి తమ ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. అలాగే రెంటికోట, టెక్కలిపట్నం కేంద్రాల్లో కూడా రెంటికోట, అల్లుకోల, లొత్తూరు, తర్లాకోట, టెక్కలిపట్నం, అమలకుడియా, బ్రాహ్మణతర్లా, బంటుకొత్తూరు, లక్ష్మీపురం పంచాయితీ పరిధిలోని వారు ఈ నెల 29వ తేదీలోగా ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవచ్చునని పేర్కొన్నారు.

కోటబొమ్మాళి: ఆధార్ అప్‌డేట్ కోసం సచివాలయాల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ తెలిపారు. 20, 21 తేదీల్లో కోటబొమ్మాళి–2, చీపుర్లపాడు, చిన్నసాన, హరిశ్చంద్రపురం, మహసాహెబ్‌పేట, 27న తర్లిపేట, చిన్నసాన, హరిశ్చంద్రపురం, జర్జంగి–1, కోటబొమ్మాళి–1, సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తామన్నారు.